క్లుప్తంగా

రేపు తొలి ఏకాదశి వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 29న తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, సాయంత్రం మహిళలతో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, అన్నమయ్య, లహరి గ్రూపుల సభ్యులతో అన్నమయ్య సంకీర్తనలు ఉంటాయని వారు వివరించారు. భక్తులు స్వామివారి దర్శించుకుని ఆశీస్సులను పొందాలని కోరారు.

చదువులో రాణించాలి

పోరుమామిళ్ల : మండలంలోని ఎంపీపీ పాఠశాలల్లోని 700 మంది విద్యార్థులకు మంగళవారం పట్టణంలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, చిత్తా థామస్‌రెడ్డి 2500 నోటు పుస్తకాలు అందజేశారు. బూరుగమానుపల్లె, రామేశ్వరం, నాగలకుంట్ల, అక్కలరెడ్డిపల్లె, వాసుదేవాపురం, జిల్లెల్ల, వెంకటాపురం, ఇందిరానగర్, చింతలపల్లె, అక్కలరెడ్డిపల్లె చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ పాఠశాల విద్యార్థులకు సంస్థ ప్రతినిధి ప్రసాదరెడ్డి పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద పిల్లలు రాణించాలని, వారి విద్యాబోధనకు ఈ సహాయం అందిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ



నోట్ పుస్తకాలు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ బంగారు రెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని రామేశ్వరంపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 22వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి హిదాయత్ ఆధ్వర్యంలో మంగళవారం 175 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. షబ్బీర్ హుస్సేన్ స్మారకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, 23వ వార్డు కౌన్సిలర్ వద్ద ఖలీల్, వద్ద దాదాపీర్, 25వ వార్డు ఇన్‌చార్జి నూరి, హౌస్ బిల్డింగ్ సొసైటీ డైరెక్టర్ హమీద్, కరీముల్లా, వేంపల్లి గౌస్ పాల్గొన్నారు.

బౌల్స్‌లో ప్రతిభచాటిన సుహానా



పోరుమామిళ్ల : హైదరాబాదులో ఈ నెల 23 నుంచి 25 వరకు జరిగిన 5వ జాతీయ స్థాయి బౌల్స్ పోటీల్లో టీమ్ మేనేజర్ షకీలాబేగం ఆధ్వర్యంలో కడప క్రీడాకారులు అద్భుత ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సాధించారు. అందులో పోరుమామిళ్ల బెస్తవీధికి చెందిన సుహానా క్రీడాకారినిగా వ్యవహరించగా, పోరుమామిళ్లకు చెందిన షకీలాబేగం టీం మేనేజర్‌గా వ్యవహరించారు. విజేతలకు బౌల్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు గుజరాత్ మాజీ క్రీడా మంత్రి గిరీష్‌చంద్ర పవార్, బౌల్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి భరత్ చౌహాన్, తెలంగాణ కార్యదర్శి డాక్టర్ వంశీధర్, ఏపీ కార్యదర్శి ఇస్మాయిల్ బాషా బహుమతులు అందజేశారు.

లక్ష్మీ నరసింహస్వామికి శాంతి కల్యాణం

ప్రొద్దుటూరు : మండలంలోని ఉప్పరపల్లె వద్ద ఉన్న శ్రీసద్గురు సమర్థ నారాయణ స్వామి ఆశ్రమంలో నారాయణ మహారాజు 33వ ఆరాధనోత్సవాలు ఆశ్రమ అధిపతి గోపాలస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం శ్రీప్రతాప మారుతి స్వామి, పంచలింగేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామిలకు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీలక్ష్మీనరసింహస్వామికి మహా నారాయణాభిషేకం నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామికి శాంతి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిపించారు. బుధవారం శతచండీ యాగం నిర్వహించి మహా పూర్ణాహుతి సమర్పిస్తారని నిర్వాహకులు తెలిపారు.

కంపచెట్లను తొలగించండి

కాశినాయన : మండలంలో వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రమైన నరసాపురానికి వెళ్లే తారురోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగించాలని సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి సుబ్బారెడ్డిలు అన్నారు. నిత్యం మండల కేంద్రానికి వందల సంఖ్యలో ప్రజలు వెళుతుంటారని, మలుపుల వద్ద ఆటోలు, మోటారు సైకిళ్లు ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించాలని వారు కోరారు.

త్వరలో రోడ్డు విస్తరణ పనులు

ప్రొద్దుటూరు : పట్టణంలోని గోపి రైస్ మిల్లు రోడ్డులో త్వరలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతామని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. రోడ్డు విస్తరణకు సంబంధించి రిషి అపార్ట్‌మెంట్ ప్రాంతంలో మంగళవారం ఆయన విద్యుత్ అధికారులతో కలసి పర్యటించారు. ఏయే ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను మార్చాల్సి వస్తుందో అంచనా వేయాలని అధికారులను కోరారు. ఆయన వెంట ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భీమునిపల్లి నాగరాజు, పోసా భాస్కర్, గంజికుంట ఆంజనేయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



శివాలయం పూజారి సుబ్బనరసయ్య కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు : అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన దువ్వూరులోని సచివాలయం -2 పరిధిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, వీధి లైట్లు, ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ నిధులు కేటాయించి త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

టీడీపీ నుంచి 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక :
దువ్వూరు గ్రామంలో టీడీపీ నుంచి 20 కుటుంబాలు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఆలమూరు ఇమాం, ఖాసీం, నాయబ్, ఖాజా, హజీమొద్దీన్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు తమకు ఎంతగానో ఆకర్షించాయని తెలిపారు.

పూజారి కుటుంబానికి ఆర్థిక సాయం:
పాత దువ్వూరులోని శివాలయంలో పూజారిగా పని చేస్తున్న సుబ్బనరసయ్య, ఆయన కుమారుడు శివకుమార్ కరోనా సోకి మరణించారు. మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేను సుబ్బనరసయ్య భార్య శశికళ తమ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, తగిన సహాయం చేయాలని అర్థించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ రూ.50 నగదు, ఇంటి నిర్మాణానికి అయ్యే సామగ్రిని అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పిలుపు మేరకు మండల నాయకులు తన శక్తి మేర రూ.1.50 లక్షలు ఎమ్మెల్యేకు ఇచ్చారు. ఆ డబ్బును సుబ్బనరసయ్య భార్య శశికళ, కూతురు శివజ్యోతిలకు అందించారు. ఇబ్బందుల్లో ఉన్న తమ కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, సర్పంచ్ దండు చెంగ్రాయుడు, ఎంపీటీసీ రఘు, సచివాలయ కన్వీనర్ శంకర్‌రెడ్డి, మండల కన్వీనర్ చిరాకి బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు అమీర్, నాసీర్, బందేఖాన్, గౌస్, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, తహసీల్దార్ రమకుమారి, పంచాయతీ కార్యదర్శులు వీరారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాలబాటలో నడిపిద్దాం

ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అద్దె బస్సుల యజమానులు బస్సుల రాకపోకల్లో సమయపాలన పాటించేలా చూడాలని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం తన కార్యాలయంలో అద్దె బస్సుల యజమానులతో, ఆర్టీసీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఈడీ మాట్లాడారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని, అందుకు తమవంతు బాధ్యతగా అందరం కృషి చేయాలన్నారు. అలాగే సిబ్బంది ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా చూడాలని ఆయన సూచించారు.

బస్సులు ఎలాంటి మరమ్మతులకు కాకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ బస్సుల్లో పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. అందరి సహకారంతోనే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించగలమని తెలిపారు. అనంతరం అద్దె బస్సుల యజమానుల సమస్యలను ఆలకించిన ఈడీ సానుకూలంగా స్పందిస్తూ వాటిని త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంలు గోపాల్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, సుమంత్ ఆర్ ఆదోని, టీవీ రామం, శ్రీనివాసులు, మధుసూదన్, రాము, జితేంద్రనాథ్‌రెడ్డితోపాటు ఇతర అధికారులు, అద్దె బస్సుల యజమానులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ



తనిఖీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

గోపవరం : గోపవరం, బద్వేలు మండలాల పరిధిలో ఉన్న ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.వి.నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని డీలర్లకు సూచించారు. కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని, రైతుల వివరాలను ఈ - పాస్‌లో నమోదు చేయాలన్నారు. కాలం తీరిన పురుగు మందులను రైతులకు విక్రయించరాదన్నారు. నకిలీ మందులు, నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు విక్రయిస్తే సంబంధిత దుకాణాదారులపై చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి దుకాణంలో రైతులకు తెలిసేలా ఏ రోజుకు ఆ రోజు ధరల పట్టికను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం రిజిస్టర్లు, బిల్ పుస్తకాలు, స్టాకు వివరాలు, తూకాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో గోపవరం, బద్వేలు వ్యవసాయాధికారులు అరవిందనాయక్, చంద్రమోహన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

పాలనను ప్రజలకు చేరువ చేశాం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధ

పోరుమామిళ్ల : పార్టీలు, ప్రాంతాలు, కులాలు, మతాలకతీతంగా పేదలందరికీ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సలహాదారు నాగార్జునరెడ్డి వివరించారు. మంగళవారం ఉదయం మండలంలోని చెన్నారెడ్డిపేట, చిన్న పుల్లివీడు, పెద్ద పుల్లివీడు సాయంత్రం సుంకేసులపల్లె, చౌటపాలెం, దమ్మన్నపల్లె గ్రామాల్లో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగారు. వారి వెంట జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా, చెన్ను రాజశేఖర్, సర్పంచులు చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, రమణారెడ్డి, రఘునాథరెడ్డి, ఎంపీటీసీలు కల్వకూరి రమణ, వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రాజీవ్‌బాషా, వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి, మస్తాన్, సీతారామిరెడ్డి, జీకే, శివయ్య, గంగయ్య తదితరులతో పాటు ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, తహసీల్దారు గంగయ్య, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందాయా? జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చారా? అని అడిగి తెలుసుకొన్నారు. గతంలో చంద్రబాబు జన్మభూమి కమిటీలతో తెలుగుదేశం వారికే అన్నీ అందించారని, అన్ని వర్గాలకు న్యాయం చేయలేదని గుర్తు చేశారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, ప్రజల వద్దకే పాలన తెచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్ అన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి మరోసారి జగన్‌ను సీఎం చేయాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా వీఎస్ ముక్తియార్ జన్మదిన వేడుకలు



వీఎస్ ముక్తియార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు, పార్టీ కార్యకర్తలు

ప్రొద్దుటూరు క్రైం : టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్ 63వ పుట్టిన రోజు వేడుకలను ప్రొద్దుటూరులోని ఆయన స్వగృహంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అభిమానుల మధ్య వీఎస్ ముక్తియార్ కేక్ కట్ చేశారు. ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు సుమారు 100 మంది రక్తదానం చేశారు. కార్మిక నాయకుడు చింతకుంట కుతుబుద్దీన్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి అలీబేగ్ ఆధ్వర్యంలో మైదుకూరు రోడ్డులో, గోల్డ్‌స్మిత్ ఖలీల్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. పలువురు ప్రముఖులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ పథకాలు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



గోపవరం : ఇంటింటి సర్వేలో పాల్గొన్న ఎంపీడీఓ హరినారాయణ, సిబ్బంది

ప్రొద్దుటూరు : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దొరసానిపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ అరవ ఈశ్వరమ్మ మునివర ఆధ్వర్యంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఈ కార్యక్రమం నిర్వహణకు సంబంధించి అధికారులు టీంలుగా ఏర్పడి ఒక్కో సచివాలయానికి ఒక రోజు వెళతారన్నారు. ఉచితంగా 11 రకాల సర్టిఫికెట్లు మంజూరు చేయడంతోపాటు అర్హతగల వారికి సంక్షేమ పథకాలు మంజూరయ్యేలా చేస్తారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, జెడ్పీ వైస్ చైర్మన్ జేష్టాది శారద, వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మోహన్ రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి, ఎంపీటీసీ మేరీ, తొగటవీరక్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, పునరుద్రారెడ్డి, చిన్నరెడ్డి, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

జూలై 1 నుంచి జగనన్న సురక్ష శిబిరాలు
మైదుకూరు : ప్రభుత్వ పథకాల లబ్ధికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న సురక్ష శిబిరాలను జూలై 1 నుంచి నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే శిబిరాల్లో మండల స్థాయి అధికారుల బృందం, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను శిబిరాల్లో అందజేస్తారు. మైదుకూరు మండలంలో అధికారుల బృందం నిర్వహించనున్న శిబిరాల వివరాలు ఇలా ఉన్నాయి. జూలై 1న అన్నలూరు గ్రామ సచివాలయం, 3న శివపురం గ్రామ సచివాలయం, 5న వనిపెంట గ్రామ సచివాలయం, 7న నంద్యాలంపేట-1 పరిధిలోని వారికి జిల్లా పరిషత్ హైస్కూల్ జీవీ సత్రం, 10న నంద్యాలంపేట-2 పరిధిలోని వారికి గ్రామ సచివాలయంలో శిబిరాలు నిర్వహిస్తారు. జూలై 12న మిట్టమానుపల్లె గ్రామ సచివాలయం, 14న తువ్వపల్లె గ్రామ సచివాలయంలో నిర్వహిస్తారు. అలాగే 15న ఎన్.ఎర్రబల్లె గ్రామ సచివాలయం, 17న విశ్వనాథపురం గ్రామ సచివాలయం, 19న ఆదిరెడ్డిపల్లె గ్రామ సచివాలయం, 21న గంజికుంట గ్రామ సచివాలయంలో శిబిరాలను నిర్వహిస్తారని ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ముమ్మరంగా ఇంటింటి సర్వే
గోపవరం : జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేను అధికారులు ముమ్మరం చేశారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు గడప గడపకు వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వారికి అవసరమయ్యే సేవలను గుర్తించి వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి జూలై 1వ తేదీ నుంచి ఉచితంగా 11 రకాల సర్టిఫికెట్లను అందజేయనున్నారు. ఇప్పటికి మండలంలోని 6 గ్రామ సచివాలయాల పరిధిలో 70 శాతం ఇంటింటి సర్వే పూర్తయిందన్నారు.

విద్యార్థినికి న్యాయం చేయాలి

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌ఆర్‌ఐటీ కాలేజీలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థినికి కళాశాల యాజమాన్యం న్యాయం చేయాలని పలు విద్యా సంఘాలు డిమాండ్ చేశాయి. కాలేజి యాజమాన్యాల నిర్లక్ష్యంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని.. ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేసి బాధితురాలికి న్యాయం చేయాలని కోరాయి.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీల నిరసన

పోరుమామిళ్ల : స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట మంగళవారం అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు తమ సమస్యలపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ మాట్లాడుతూ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు మేరకు అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇచ్చి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. జూలై 10న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని పిలుపిచ్చారు. ఆందోళనలో విజయమ్మ, నారాయణమ్మ, లీలావతి, ఫాతిమా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సీబీఐటీలో యువ ఉత్సవ్

చాపాడు : భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో స్థానిక సీబీఐటీ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం ఉదయం 10.30గంటలకు జిల్లా స్థాయి ఉత్సవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వాగ్దాడం శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకోవడం అభినందనీయం



విద్యా సామగ్రిని అందజేసిన అధికారులు

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఆదుకునేందుకు తిరుమల ట్రస్టు చేస్తున్న సేవలు అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి పి.నాగరాజు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డిలు పేర్కొన్నారు. స్థానిక లక్ష్మీపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలోని 120 విద్యార్థులకు బెంగుళూరుకు చెందిన తిరుమల ట్రస్టు సహకారంతో విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు ఖాసీం పీరా, శ్రీనివాసులరెడ్డి, శ్రీనివాసులు, అనురాధ, విజయశ్రీ, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.వి.సుబ్బారావు, సెక్రటరీ కె.నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సిద్ధం



ఆర్బీకేలో నిల్వ ఉన్న ఎరువులు

చాపాడు : ఖరీఫ్‌లో పంటలు సాగు చేసుకునే రైతులకు అవసరమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాలలో సిద్ధంగా ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి మ్యాగి తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో 10 మెట్రిక్ టన్నులు ఉంచామన్నారు. ప్రస్తుతం మండలంలోని రైతులు వరి సాగు కోసం నారుమళ్లు సిద్ధం చేస్తుండటంతో పాటు పసుపు సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. అయ్యవారిపల్లె, తిమ్మాయపల్లె, రాజువారిపేట, సీతారామాపురం, చాపాడు, ఖాదర్‌పల్లె వంటి గ్రామాలలో నారుమళ్లు వేస్తున్నారు. సీతారామాపురం, శ్రీరాములపేట, కుచ్చుపాప, ఇంకా పలు గ్రామాలలో పసుపు సాగు చేసుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. రైతులు ఆర్‌బీకే కేంద్రాల్లోని వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి ఎరువులను తీసుకోవచ్చని ఏఓ తెలియజేశారు.

ఆర్బీకేలకు చేరిన ఎరువులు
అట్లూరు : వర్షాలు మొదలవుతుండటంతో ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలలో ఎరువులను నిల్వ చేస్తోంది. ఇప్పటికే ఆర్బీకేలలో 28-28-0 పాస్ఫేటు రకాన్ని అట్లూరు, కొండూరు ఆర్బీకేలలో నిల్వ చేసింది. మంగళవారం ఆయా ఆర్బీకేలకు 20 టన్నుల ఎరువులు చేరాయి. మిగిలిన రైతు భరోసా కేంద్రాలకు కూడా అవసరమైన మేర యూరియాను సరఫరా చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి రామకృష్ణయ్య, బీహెచ్‌ఏ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.


ఎండీటీ చికిత్సతో కుష్టు వ్యాధి నయం



సర్వేలో భాగంగా మచ్చలను పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : ఎండీటీ చికిత్సతో కుష్టు వ్యాధి పూర్తిగా నయం అవుతుందని డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. కుష్టు వ్యాధిని గుర్తించడానికి బొకరాపేట వీధిలో మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ర్యాలీ, అవగాహన కార్యక్రమంలో డాక్టర్ మాట్లాడుతూ ఇంట్లోని కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా స్పర్శలేని మచ్చలు, శరీరంపై రాగి వర్ణం కలిగిన పొడలుంటే పేర్లను నమోదు చేసుకొని డాక్టర్‌కు చూపించాలన్నారు. కుష్టు వ్యాధిగా నిర్ధారణ అయితే 6 చికిత్స ఇస్తారని తెలిపారు. వైద్యుల సూచన మేరకు మందులు వాడితే వ్యాధి నయం అవుతుందని చెప్పారు. ప్రజలందరూ సర్వేకు సహకరించాలని కోరారు. డీపీఎంఓ శివశంకరయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సీఓ సుబ్బారెడ్డి, హెల్త్ సెక్రటరి యం రిబక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ



కరపత్రాలు పంచుతున్న కిసాన్ మోర్చా నాయకులు

పోరుమామిళ్ల : కేంద్ర ప్రభుత్వం గత 9 సంవత్సరాలుగా అమలు చేస్తున్న పథకాలు, అందిస్తున్న సాయం గురించిన వివరాలతో ముద్రించిన కరపత్రాలను మంగళవారం బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు మండలంలో పంపిణీ చేశారు. కొత్రపాటిపల్లె, ఇందిరానగర్, రామిరెడ్డికుంట, వాసుదేవాపురం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఉట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా అత్యధిక ఇండ్లు కేటాయించారని, ఆహార భద్రత, ఉపాధి హామీ కల్పన, స్వచ్ఛ భారత్, ముద్ర యోజన, మత్స్య సంపద యోజన, మహిళల కోసం, మైనారిటీల కోసం అమలు చేసిన పథకాలు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో విజయ భాస్కర్‌రెడ్డి, పీరయ్య, బాలకృష్ణ, శేఖర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం
చాపాడు : మండల పరిధిలోని చాపాడు, నాగులపల్లె, ఖాదర్‌పల్లె గ్రామాలలో మంగళవారం సాయంత్రం కేంద్ర ప్రభుత్వ పథకాలకు చెందిన కరపత్రాలను బీజేపీ నాయకులు పంపిణీ చేసి ప్రచారం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పరిపాలనపై ప్రజలకు వివరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మాచనూరు సుబ్బరాయుడు, చాపాడు మండల బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గోడౌన్ స్టాకిస్టుగా గురు బాబు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులోని పౌరసరఫరాల సంస్థ గోడౌన్ స్టాకిస్టుగా పి.గురుబాబును నియమిస్తూ కలెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. పోరుమామిళ్లలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయనను ప్రొద్దుటూరుకు బదిలీ చేశారు. గోడౌన్‌లో జరిగిన సంఘటనకు సంబంధించి ఇటీవల డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న రామకృష్ణారెడ్డిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న ఎంఈఓ

ప్రొద్దుటూరు : పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని పెన్నానగర్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల హెడ్మాస్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో మంగళవారం జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం జగనన్న అమ్మ ఒడి ద్వారా డబ్బు ఇస్తోందని, నాణ్యతగల భోజనం ఏర్పాటు చేశామని, యూనిఫాం, పుస్తకాలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు సయ్యద్ బాషా, ఫయాజుద్దీన్, షబానా, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ మహబూబ్‌చాన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అమ్మఒడి ఒక వరం
బి.కోడూరు : అమ్మఒడి పథకం పేద, బడుగు, బలహీన విద్యార్థులకు వరం లాంటిదని మండల విద్యాశాఖాధికారి సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని రామచంద్రాపురం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రమణమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అమ్మఒడిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగు పడ్డాయన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ లక్ష్మీదేవి, సర్పంచ్ నరసమ్మ, కమిటీ సభ్యులు, ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు విజయబాబు, శ్రీనివాసులు, మేరీ, వెల్ఫేర్ సెక్రటరీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల అందజేత
బి.కోడూరు : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తోందని ఎంఈఓ మూరతోటి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం అయ్యవారిపల్లె ఎస్సీకాలనీలోని ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిచ్చిరెడ్డి, తోటి సహ ఉపాధ్యాయుడు బాబురావులు మంచి మనస్సుతో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా పాఠశాలలోని విద్యార్థులకు సుమారు ఒక్కొక్క కిట్ ధర రూ.350లలో 22 మంది విద్యార్థులకు ఎంఈఓ సునీల్‌కుమార్ చేతులమీదుగా కిట్‌లను అందజేశారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి
కలసపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ఈ విషయాన్ని తల్లిదండ్రులకు వివరించి తమ పిల్లలను చేర్పించాల్సిన బాధ్యత పేరెంట్స్ కమిటీ సభ్యులపై ఉందని ఎంఈఓ - 2 ఎస్.మస్తాన్‌వలి తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి విద్యారంగంలో ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పుల గురించి తల్లిదండ్రులకు తెలియజేశారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం చేసిన కృషి అభినందనీయమన్నారు. ప్రతి నెల జరిగే తల్లిదండ్రుల సమావేశానికి హాజరై పిల్లలు చదువు విషయాలను తెలుసుకోవాలని తెలిపారు.